రహదారులపై రయ్..రయ్!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లె రోడ్లకు ప్రాధాన్యం
- ఇప్పటికే పలు గ్రామాల రోడ్ల నిర్మాణం పూర్తి
- నేడు పడిదెంపాడు-పూడూరు రోడ్డుకు శంకుస్థాపన

జగనన్న ప్రభుత్వం పల్లె రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ హయాంలో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా అధ్వానంగా ఉన్న రోడ్లను సైతం బాగు చేసి ప్రయాణికులు రయ్‌ను దూసుకుపోయేలా రహదారులను తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే కోడుమూరు నియోజకవర్గంలోని పలు రోడ్లను నిర్మించిన ప్రభుత్వం.. నేడు పడిదెంపాడు-పూడూరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనకు సిద్ధమయ్యింది.

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని పల్లె రోడ్ల నిర్మాణానికి పాలకులు కృషి చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పట్లో కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. నియోజకవర్గంలోని కర్నూలు రూరల్ మండలంలో పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులున్నాయి. వీటిలో కర్నూలు నుంచి ఉల్చాల, రేమట మీదుగా సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామం వరకు రూ.6 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం చివరి దశలో ఉంది. టీడీపీ హయాంలో తూతూ మంత్రంగా వేసిన కర్నూలు-సుంకేసుల రహదారి అప్పట్లో ఏడాదిన్నరకే దెబ్బతినడంతో వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.1.30 కోట్లతో ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మిగిలి పోయిన పనులను రూ.10 కోట్లతో చేశారు. పంచలింగాల నుంచి గొందిపర్ల వరకు రూ.15 కోట్లతో రోడ్డు వేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని నంద్యాల రోడ్డు నుంచి పసుపుల, సుద్దిరెడ్డిపల్లె మీదుగా కర్నూలు-గుంటూరు రోడ్డు వరకు రూ.10 కోట్లతో పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు-గుంటూరు రోడ్డు నుంచి పడిదెంపాడు మీదుగా పూడూరు, కోళ్లబాపురం వరకు 14 కి.మీ మేరకు రూ.11.85 కోట్లతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. జి.పుల్లారెడ్డి కాలేజీ నుంచి జగన్నాథగట్టులోకి ట్రిపుల్ ఐటీ వరకు రూ.4 కోట్లతోను, నేషనల్ లా యూనివర్సిటీకి రూ.2 కోట్లతో



(నాడు) ఉల్చాల - రేమట రోడ్డు



(నేడు) ఉల్చాల - రేమట రోడ్డు



గొందిపర్ల నుంచి ఇందిరమ్మ కాలనీకి వేసిన బీటీ రోడ్డు

బీటీ రోడ్లు వేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తుంగభద్ర నది నుంచి ఇసుక విచ్చల విడిగా దోపిడీ చేయడంతో రోడ్లు గుంతలు గుంతలు పడి ఛిద్రమైంది. ఈ రోడ్డును ఎన్నికల్లోపే వేసేందుకు పనులు చేపట్టనున్నారు. అదే విధంగా గొందిపర్ల గ్రామం నుంచి ఇందిరమ్మకాలనీ వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డును రూ.38.40 లక్షలతో బీటీ రోడ్డు వేశారు.

పడిదెంపాడు-పూడూరు రోడ్డుకు నేడు శంకుస్థాపన

కర్నూలు రూరల్ మండల పరిధిలో కర్నూలు-గుంటూరు రోడ్డు నుంచి పడిదెంపాడు మీదుగా పూడూరు, కోళ్లబాపురం వరకు బీటీ రోడ్డును వేసేందుకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరుకానున్నారు.



పడిదెంపాడు-పూడూరు రోడ్డు

క్లుప్తంగా

మౌలానా సేవలు చిరస్మరణీయం



ఆజాద్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న డీఎండబ్ల్యూఓ సునీల్‌కన్నా

కర్నూలు(అర్బన్): స్వాతంత్ర సమరయోధులు, భారత ప్రభుత్వ తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డా.ఏ సునీల్‌కన్నా అన్నారు. గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సునీల్ కన్నా మాట్లాడుతూ బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఆజాద్ దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారన్నారు. విద్యాశాఖ మంత్రిగా దేశానికి అందించిన సేవలను గుర్తించి భారత ప్రభుత్వం భారతరత్న బిరుదును ఇచ్చి సత్కరించిందన్నారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులు సర్వేష్‌బాషా, బి.పుష్పాంజలి, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుల ఒక్కరోజు సమ్మె

కర్నూలు(అగ్రికల్చర్): దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులు(ఏపీజీబీ) శుక్రవారం బంద్ పాటించనున్నట్లు ఏఐఆర్ఆర్‌బీఈఏ సెంట్రల్ కమిటీ సభ్యుడు మంజునాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాన్సర్ బ్యాంకుల ప్రమేయం లేకుండా రాష్ట్ర స్థాయి గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేయాలని, గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులను భర్తీ చేయాలని, తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా పదోన్నతులు, సెలవు నియమాలు పాటించాలని తదితర డిమాండ్‌లను సాధించుకునేందుకు ఒక్క రోజు సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. ఖాతాదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముమ్మరంగా దోమల నివారణ చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని జొహరాపురం వద్ద హంద్రీనదిలో దోమల నివారణ చర్యలు ముమ్మరంగా చేపడుతున్నారు. గురువారం నదీ వెంట ఉన్న గుర్రపుడెక్కను క్రేన్లు, తెప్పల ద్వారా తొలగించారు. నదిలో పైరోసిస్ నూనె, యాంటీలార్వా స్ప్రే, ఆయిల్ బాల్స్ చల్లారు. 45 సచివాలయం పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల వద్ద డెంగీ కేసు నమోదు కావడంతో ఆ ఇంటిని పైరిత్రిన్ స్ప్రే చేయించారు. పీడీపీ లార్వా సర్వే నిర్వహించి చుట్టుపక్కల ప్రదేశాలలో నిలువ ఉన్న నీటిని తొలగించి స్ప్రే చేయించారు. ఇప్పటికే కాలనీలలో ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టినట్లు నగరపాలక మలేరియా అధికారి వెంకటేశులు వెల్లడించారు.

బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీలను ఓడించాలి

కర్నూలు(అర్బన్): కేంద్రంలో బీజేపీతో పొత్తు పెట్టుకునే పార్టీలను ఓడించాలని రాయలసీమ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు అనంత రత్నంమాదిగ అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో మాదిగలు ఎటువైపు అంశంపై గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్డు కులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. త్వరలో జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పా టు చేసి తమ మద్దతు ఏ పార్టీకి అనేది ప్రకటి స్తామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సోమసుందరం మాదిగ, రిటైర్డ్ పోస్టుమాస్టర్ ఎద్దుల డేవిడ్ మాదిగ, రేపల్లె ప్రతాప్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీఈడీ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న బీపీఈడీ, ఎంపీఈడీ పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడుతున్న ముగ్గురు విద్యార్థులను డిబార్ చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ సుందరానంద పుచ్చ తెలిపారు. బీపీఈడీ పరీక్షలకు 77 మందికి గానూ 73 మంది, ఎంపీఈడీ పరీక్షలకు 127 మందికి గానూ 119 మంది హాజరయ్యారన్నారు. వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. వీసీతో పాటు రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.టి.కె.నాయక్, అబ్జర్వర్ ప్రొఫెసర్ నరసింహులు ఉన్నారు.

నేడు ఎన్నికల అధికారులకు శిక్షణ

కర్నూలు(సెంట్రల్): రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకులు, మోడల్ కోడ్ అధికారులకు శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5.30 గంటల మధ్య జెడ్పీలో శిక్షణ ఇవ్వనున్నారు. మాస్టర్ ట్రైనర్లుగా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, డీఐసీజీఎం మారుతీప్రసాదు వ్యవహరిస్తారు. అంతకుముందు ఉదయం జెడ్పీలోనే వ్యయ పరిశీలకులకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ఈ శిక్షణకు మాస్టర్ ట్రైనర్లుగా జిల్లా సహకార కోఆపరేటివ్ ఆఫీసర్ రామాంజనేయులు, జిల్లా ఖజానా అధికారి కె.రమేష్‌బాబు వ్యవహరించనున్నారు

డాక్టరేట్ ప్రదానం

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన కొత్త కాప గౌతమి తిరుపతి ఐఐటీలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్ అమిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమి 'ఫైనాన్సియల్ డెవలప్‌మెంట్ అండ్ ఇండస్ట్రియలైజేషన్ - ఎంపిరికల్ అనాలసిస్' అంశంపై డాక్టర్ రాహుల్ ఎ సిరోహి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ డాక్టరేట్ అందుకున్నారు.

సెబ్ సోదాలు

కర్నూలు (టౌన్): సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో గురువారం అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ.తాండ్రపాడు గ్రామంలోని బి.గంగావతి ఇంటి నుంచి 47 ఓల్డ్ ఆడ్మిరల్ మద్యం బాటిళ్లు, సుంకేసుల చెక్‌పోస్టు వద్ద ఆల్టో కారులో అక్రమంగా తరలిస్తున్న 8 ఇంపీరియల్ బ్లూ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ కె.ఆర్ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. స్టాంటన్‌పురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను జప్తు చేసి రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

శిరీషా మృతిపై విచారణ వేగవంతం చేయాలి

– రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సాక్షి, అమరావతి: కర్నూలు పట్టణంలో గిరిజన మహిళ శిరీషాబాయి అనుమానాస్పద మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఆదేశించారు. ఈ కేసుపై స్పందించిన ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. గిరిజన యువతి అనుమానాస్పద మృతిపై కర్నూలు మూడవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సత్వర విచారణ జరగకపోవడంతో మృతిరాలి బంధువులు న్యాయం కోసం ధర్నా చేశారన్నారు. వారిపై పోలీసులు లాఠీచార్జీ చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై కమిషన్ తక్షణమే స్పందించి కర్నూలు జిల్లా ఎస్పీని విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరామన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలను కమిషన్ ఉపేక్షించదని, విచారణలో వెల్లడైన అంశాలపై తక్షణ చర్యలు చేపడతామని శంకరరావు తెలిపారు.

డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కారానికి కృషి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ కళాశాలల యాజమాన్యాల సంఘం ఆధ్వర్యంలో గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు, ఇన్‌స్పెక్షన్ కమిటీల రిపోర్ట్ ఆధారంగా డిగ్రీ కళాశాలలకు అఫ్లియేషన్ ఇస్తామన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఏవైనా సమస్యలు ఉంటే వర్సిటీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. అలా కాకుండా కోర్టులను ఆశ్రయిస్తే వర్సిటీకి, ప్రభుత్వానికి వ్యతిరేకం అవుతారన్నారు. ఇది సరైన విధానం కాదన్నారు. కళాశాలల ప్రిన్సిపాల్స్ అభ్యర్థన మేరకు 2014 కంటే ముందు డిగ్రీ కోర్సుల్లో చేరి పూర్తి చేసుకోలేకపోయిన విద్యార్థులందరికీ చివరి అవకాశంగా పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. రెక్టార్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులు పెంచుకోవాలన్నారు. ఇన్‌స్పెక్షన్ కమిటీ రెకమెండేషన్స్‌ను పూర్తి చేయాలన్నారు. వసతులు లేకుండా



మాట్లాడుతున్న ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి.సుధీర్ ప్రేమ్‌కుమార్

అఫ్లియేషన్‌కు డిమాండ్ చేయడం సరికాదన్నారు. పాఠ్యాంశాలు బోధించే అధ్యాపకులనే స్పాట్ వాల్యుయేషన్‌కు పంపాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నాగుల అంకన్న మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్స్, ప్రిన్సిపాల్స్ నేరుగా వర్సిటీ అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. అనంతరం వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ సీవీ కృష్ణారెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ పీవీ సుందరానంద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, సంఘం ప్రతినిధులు సన్మానం చేశారు. ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి గుర్రాల వెంకటరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, అధ్యక్షులు వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు జాతి ముద్దు బిడ్డ నరసింహారెడ్డి

కర్నూలు కల్చరల్: తెలుగు జాతి ముద్దు బిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఏక్యాంప్‌లోని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సర్కిల్‌లో స్వాతంత్ర్య సరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయమనోహరి మాట్లాడుతూ నాటి తరం నాయకుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచిన సాహస వీరుడు నరసింహారెడ్డి అన్నారు. అలాంటి మహా యోధున్ని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెల్ల దొరల గుండెల్లో భయానక వాతావరణం సృష్టించి స్వాతంత్ర్య సముపార్జనలో కీలకంగా నిలిచిన పాలేగాడు నరసింహారెడ్డి అన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. సమాజ సేవలో ప్రముఖులైన వారిని సన్మానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కైపా పద్మలత, నాగలక్ష్మిరెడ్డి, సేవా సమితి అధ్యక్షులు వి.విజయమోహన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు కేవీ సుబ్బారెడ్డి, జోగి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అతిథులు సేవా సమితి సభ్యులు

టీజీవీ కళాక్షేత్రంలో ..

సీక్యాప్ టీజీవీ కళాక్షేత్రంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సైరా నరసింహారెడ్డి నాటకం కళాకారులు నివాళులర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులు, రచయితలు అజీజ్, పత్తి ఓబులయ్య, శ్రీనివాస్‌రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, మహమ్మద్ మియ్యా, లక్ష్మీకాంతారావు, క్రిస్టఫర్ శామ్యూల్, ఎంఆర్ రాధిక, బలరాం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



కలశ పూజ



గణపతి హోమంలో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీలోని అంబా భవాని ఆలయంలో ఈనెల 24వ తేదీన జరగనున్న కుమార స్వామి, దత్తాత్రేయ స్వాముల వారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రారంభ పూజలు నిర్వహించారు. గణపతి పూజ, సప్తమాతృక పూజ, గణపతి హోమం, దీక్షా హోమాలను భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కర్నూలు సిటీ: గోరుముద్ద పథకం అమలులో నిర్లక్ష్యం తగదని డీఈఓ కె.శామ్యూల్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ వెనుక ఉన్న ఇందిరా గాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యత సక్రమంగా లేదని కొందరు విద్యార్థులు కలెక్టర్ జి.సృజనకు అన్నం ప్లేట్లతో వెళ్లి ఫిర్యాదు చేశారు. స్పందిన ఆమె విచారణకు డీఈఓను ఆదేశించారు. ఆయన స్కూల్ వద్దకు చేరుకుని తనిఖీ చేశారు. వంట ఏజెన్సీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజనం నాణ్యతపై పలువురు విద్యార్థులను అడిగి డీఈఓ తెలుసుకున్నారు. స్కూల్ హెచ్‌ఎంకు చార్జ్ మెమో జారీ చేయాలని డీఈఓ సిబ్బందిని ఆదేశించారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సెట్కూరు సీఈఓ రమణ సూచించారు. గురువారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో నియోజకవర్గ పరిధిలోని కళాశాలల విద్యార్థులకు, లెక్చరర్లకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. దేశాన్ని పాలించే ప్రజా ప్రతినిధులను ఎన్నుకోవడంలో యువత కీలకమన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. సిబ్బంది సుబ్బన్న అనంత్, వెంకటేష్ రాహుల్‌సింగ్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫెయిలైన వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో 2014 సంవత్సరం కంటే ముందు డిగ్రీ వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌యూ వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. డిగ్రీలో ఫెయిలైన వారికి పరీక్షలు రాసే అవకాశం కల్పిస్తే డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారని వీసీ దృష్టికి తీసుకొచ్చారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, జిల్లా అధ్యక్షులు అఖండ, జిల్లా ఉపాధ్యక్షులు రమణ, నగర అధ్యక్షులు దామోదర్ వీసీకి వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నాలుగు షాపులకు వేలంపాటలు

- రూ.9.58 లక్షల ఆదాయం

కర్నూలు (టౌన్): నగరపాలకలో ఖాళీగా ఉన్న షాపులకు గురువారం నగర పాలక కౌన్సిల్ హాలులో బహిరంగ వేలం నిర్వహించారు. చల్లావారి వీధి, జంపాల శివయ్య నగర్, షరీన్‌నగర్‌లోని నాలుగు మున్సిపల్ షాపులకు పోటీపడి దక్కించుకున్నారు. దీనివల్ల నగరపాలక రెవెన్యూ విభాగానికి రూ.9,58,500 ఆదాయం సమకూరిందని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు తెలిపారు. శుక్రవారం మరికొన్ని మున్సిపల్ షాపులకు వేలాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలాల్లో రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, వాజిద్, రాజు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది

ఆధ్యాత్మిక సమాజమే సర్వశ్రేష్ఠం





ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు, ప్రత్యేక అలంకారంలో గౌరనితాయిలు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక విలువలతో కూడిన సమాజమే సర్వశ్రేష్ఠమైందని ఇస్కాన్ ప్రవచనకారులు వైష్ణవ కృప చైతన్య దాస్ ప్రభు అన్నారు. గురువారం ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో నిత్యానంద త్రయోదశి మహోత్సవం నిర్వహించారు. గౌరనితాయిలకు మహా శంఖాభిషేకం నిర్వహించారు. స్వామివారికి 108 రకాల భక్ష్యాలతో నైవేద్యం నివేదించారు. నిత్యానంద లీలలపై వైష్ణవ ప్రభు ఉపన్యసించారు. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు సన్మానం





వలంటీర్లను సన్మానిస్తున్న ఆదిమూలపు సతీష్, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు

కర్నూలు సిటీ: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 372 మంది ఉత్తమ వలంటీర్లను వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, కర్నూలు ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఇంటింటికీ అందజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. వారు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించి సేవా వజ్రకు రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30 వేలు, సేవా మిత్రకు రూ.15 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించి సత్కరిస్తోందన్నారు. మిగతా వలంటీర్లు కూడా అవార్డు పొందిన వలంటీర్లను స్ఫూర్తిగా తీసుకుని సేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ నెహెమియా, ఉల్చాల సర్పంచు విద్యాసాగర్, ఎంపీటీసీ రామ్‌నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పంచలింగాల వెంకటేశ్వరరెడ్డి, సింగవరం వెంకటేశ్వర రెడ్డి, ఉల్చాల వాసు, సంపత్‌కుమార్, నిడ్జూరు ప్రసాద్, నిడ్జూరు సంపత్ కుమార్, పడిదెంపాడు వెంకటేశ్వర్లు, తాండ్రపాడు చిన్న లక్ష్మన్న, సురేష్, మిలిటరీ కాలనీ వెంకటేశ్వర్లు, పూడూరు మహేష్, ఆదాము, భాస్కర్, శివరామపురం శివన్న, అనూక్ పాల్గొన్నారు.

ఘన నివాళి

కర్నూలు (టౌన్): స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతులను నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ ఎంతో సేవలందించారన్నారు. బ్రిటీష్ వారికి ఎదురొడ్డి నిలిచిన సాహసవీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, పార్టీ బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ శ్వేతారెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



ఆజాద్, నరసింహారెడ్డి చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నేతలు